క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు బుధవారం విశ్వవిద్యాలయ కులపతి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్,సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వ్యవహారాలపై వారితో చర్చించారు.

కాలుష్య ప్రభావిత ప్రజలను ఆదుకోవాలి

పరవాడ: ఔషధ పరిశ్రమల కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొద్దపు చిన్నారావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తహసీల్దారు పి.కనకారావుకు వినతిపత్రం అందజేశారు. కాలుష్య ప్రభావిత గ్రామాల్లో ప్రతీ కుటుంబానికి నెలకు రూ.10 వేలు చెల్లించాలన్నారు. అదేవిధంగా రైతులు, పంట పొలాలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని.. గ్రీన్‌బెల్ట్, బఫర్‌జోన్లగా ప్రకటించిన భూముల్లో ఆంక్షలు తొలగించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాలుష్య ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో వైద్య సేవలు అందించాలని చిన్నారావు కోరారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఐఏఎస్ అధికారి రిచా మిశ్రా



రిచా మిశ్రాకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో ఎస్.ఎస్.మూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఐఏఎస్ అధికారి రిచా మిశ్రా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: నిర్వహణ పనుల నిమిత్తం రాంపురం ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రసాద్‌నగర్, శ్రమశక్తినగర్ 3, 4, ఆఖరి బస్టాప్, బంగారమ్మకాలనీ, సత్యానగర్, చినముషిడివాడ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని పేర్కొన్నారు.

సాంకేతికత వినియోగంలో ముందంజ

ఎన్టీపీసీ వెండర్ మీట్‌లో వక్తలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో శకుంతలం ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2023లో భాగంగా శుక్రవారం వెండర్ మీట్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థ నుంచి 50 మంది విక్రేత ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వెస్ట్–2) సి.శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న మీట్ వెండర్ల సమస్యలను అంచన వేశారు. వివిధ పీఎస్‌యూల్లో సాంకేతికతను ఉపయోగించడంలో ఎన్టీపీసీ ముందంజలో ఉన్నందుకు సింహాద్రి ఎన్టీపీసీ ప్రతినిధులను అభినందించారు. ఈ సమావేశంలో యూఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కుందు, చీఫ్ జనరల్ మేనేజర్ యు.హెచ్.గోఖే పాల్గొన్నారు. సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, వీపీజీ చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామారావు, డీజీఎంలు, ఉద్యోగులు హాజరయ్యారు.



సింహాద్రి ఎన్టీపీసీ వెండర్ మీట్‌లో పాల్గొన్న ప్రతినిధులు

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారని పి.బోనంగి గ్లోబల్ సంస్కృతి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో జరిగిన సౌత్ జోన్ ఆర్చరీ పోటీల్లో రికర్వ్ టీమ్ ఈవెంట్ విభాగంలో పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చిన సాహిత్‌కృష్ణంరాజు, వి.సాకేత్‌రామ్, కుందన్‌కుమార్ ఈ నెల 5 నుంచి 10 వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులతో పాటు కోచ్‌లు హరిరామసింగ్, గోవింద్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబును అభినందించారు.

6న పరవాడ మండల సమావేశం

పరవాడ: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఏవో జి.వి.రాంబాబు చెప్పారు. సమావేశానికి ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఏవో కోరారు.

డస్ట్ అలవెన్స్ చెల్లించాలని నిరసన

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్‌ను తక్షణమే అమలు చేయడానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ మెయిన్‌గేటు ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు డస్ట్ అలవెన్స్ ప్రకటించి మూడు నెలలు కావస్తున్నా నేటి వరకు అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే వేతనాలతో అలవెన్స్ కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టులో చేసిన అగ్రిమెంట్ నేటికి అమలు కాకపోతే యూనియన్‌లు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. అలాగే ఎన్టీపీసీ లోగోతో కూడిన ఐడీ కార్డులు మంజూరు చేయాలని కోరారు. భద్రతా ప్రమాణాలపై ఆడిట్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గోవిందరాజు, నాయకులు ఎం.సత్యనారాయణ, రాంబాబు, శ్రీను, సన్యాసిరావు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

'ఉక్కు' ఆస్పత్రి సిబ్బందికి లాంగ్ సర్వీస్ అవార్డులు



ఉద్యోగులకు లాంగ్ సర్వీసు అవార్డులు అందజేస్తున్న విభాగాధిపతి డాక్టర్ ప్రకాశ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సిబ్బందికి శుక్రవారం లాంగ్ సర్వీసు అవార్డులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ఝాన్సీ మేరీ, జె.జి.వి.రత్నం, ఆకుల రవణమ్మ, శారద, లక్ష్మీదేవి, చంద్రన్ రూత్‌లకు ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఆర్ విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్ చేతుల మీదుగా 150 గ్రాముల సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎ.పి.నవీన్ కుమార్, డాక్టర్ గిరిధర్, డాక్టర్ సుధ, మల్లేశ్వరి, కె.గోపాలకృష్ణ, జెర్రిపోతు మోహన్‌కుమార్, సుందరమణి, భాస్కర్ పాల్గొన్నారు.

ఉక్కు అమరవీరులకు నివాళి

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉక్కు అమరవీరులకు శుక్రవారం నివాళి అర్పించారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో 21 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఉక్కు ఉద్యమ నేత టి.అమృతరావు దీక్ష విరమించిన రోజు సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ముఖ్య అతిథిగా హాజరై అమృతరావు విగ్రహానికి పూల మాల వేసి, నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ అమృతరావు ఆనాడు నిస్వార్థంగా చేసిన దీక్ష ద్వారా తన ప్రాణాలు అర్పించానికి సిద్ధపడ్డారన్నారు. ఆ ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చేత నిమ్మరసం ఇప్పించి, దీక్ష విరమింప చేసిందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ అమరవీరుల త్యాగాన్ని నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి దాలినాయుడు, జి.అప్పలరెడ్డి, ఎన్నేటి రమణ, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, డి.అప్పలరాజు, పులి పెంటయ్యరెడ్డి, మురళి, బొడ్డ గోవింద తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు అమరవీరులకు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ర్యాగింగ్ దుష్పరిణామాలపై అవగాహన



ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ర్యాగింగ్ దుష్పరిణామాలు, పర్యవసానాలు, చట్టాలపై అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగింది. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు నేతృత్వంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రత్యేక పోస్టర్లను ప్రదర్శించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పించారు.

అనధికారిక పార్కింగ్‌పై కొరడా



రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేసిన కారు చక్రానికి లాక్ చేస్తున్న ఎస్ఐ రమేష్

పెందుర్తి: రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్న వాహనదారులపై పెందుర్తి ట్రాఫిక్ విభాగం పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, వేపగుంట ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలకు ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన తాళాలు వేశారు. ఆయా వాహనాలకు భారీ ఎత్తున జరిమానా విధించనున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వాహనదారులు పార్కింగ్ విషయం తగిన జాగ్రత్తలు పాటించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలను భారీగా విధిస్తామని హెచ్చరించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన



క్యాడెట్లను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన నౌసైనిక్ క్యాడెట్లు ఎండీ ముబీన్, ఎ.విజయ్‌కుమార్, వాయు సైనిక్ క్యాడెట్లు పవన్ కార్తికేయ, రామ్ నారాయణలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు. ముంబయిలోని లోనావాలలో జరిగిన అఖిల భారత నౌసైనిక్ శిబిరంలో ముబీన్, విజయ్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ జలహల్లి, బెంగళూరులో జరిగిన అఖిల భారత వాయు సైనిక్ శిబిరంలో పవన్, రామ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వి.హెచ్.శ్రీకాంత్, మేజర్ బ్రహ్మానందరెడ్డి, ఫ్లయింగ్ అధికారి బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు అభినందించారు.

క్రాస్ బౌ షూటింగ్‌లో విశాఖ షూటర్ల సత్తా

కొమ్మాది/దాబాగార్డెన్స్: ఆగ్రాలో గత నెల 26 నుంచి 31వ తేదీ వరకు జరిగిన 10వ అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విశాఖ షూటర్లు సత్తా చాటారు. ఎండాడకు చెందిన వి.ఎస్ లోక్‌జిత్ జూనియర్ బాలుర ఓపెన్ ఫ్రీస్టైల్ కేటగిరీలో స్వర్ణ పతకం, నగరానికి చెందిన పేపకాయల సాయి కౌశిక్ రెండు వెండి పతకాలు సాధించాడు. అత్యంత చిన్న వయసులోనే లోక్‌జిత్ అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకంపై అతని తల్లిదండ్రులు రవికుమార్,సహజ హర్షం వ్యక్తం చేశారు. కాగా.. ఆస్ట్రేలియా, , స్వీడన్, ఫిన్లాండ్, యూఎస్ఏ, యూకే, పోర్చుగల్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 65 మంది ఈ పోటీల్లో పడ్డారు.

మందుబాబులకు భారీ జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు భారీ ఎత్తున జరిమానాలు విధించింది. ఒకరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి కూడలి, చినముషిడివాడ, నాయడుతోట, వేపగుంట ప్రాంతాల్లో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. 23 మంది వాహనదారులు మద్యం సేవించి నడపడంతో వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం నగరంలోని జుడీషియల్ మెజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పర్చగా 23 మందికి కలిపి రూ.5,28,000 జరిమానా విధించారు. సుజాతనగర్‌కు చెందిన ముద్దాడ అప్పన్న అనే వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష, రూ.100 జరిమానాను జడ్జి విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఖైదీ రాజాచంద్ర మృతిపై 7న విచారణ

తగరపువలస: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బండ్లగూడకు చెందిన ఖైదీ యడ్ల రాజాచంద్ర (41) ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రి చికిత్స పొందుతూ ఈ ఏడాది మార్చి 9న మృతి చెందినట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో రాజాచంద్ర మృతిపై భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిని విచారణ అధికారిగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నియమించారు. ఈ నెల 7న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణ నిర్వహించనున్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని భాస్కరరెడ్డి కోరారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో పలు విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నారు. పలు మెడికల్ ఆఫీసర్ పోస్టులు కాంట్రాక్ట్, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు http@//visakhapatnam.nic.in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత నకలు కాపీని ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు.

వైద్య రంగానికి పెద్దపీట



మందులు అందిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారని జీవీఎంసీ జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 500 సచివాలయం పరిధిలోని చీమలాపల్లి, పోర్లుపాలెం, శేషాద్రినగర్, ఎంఈఎస్ కాలనీ, బ్రహ్మం గారిమఠం ప్రాంతాల ప్రజల కోసం పురుషోత్తపురంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ముమ్మన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆయా రంగాలను దేశానికే ఆదర్శంగా ఉండేలా సేవలు అందిస్తున్నారని చెప్పారు. గనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. దాదాపు 400 మంది ఓపీ ద్వారా వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దేవిశ్రీ, నాయకులు అయిత ఎర్రయ్య, కాళ్ల గంగాధర్, రాపర్తి మాధవరావు, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బొట్ట గోవింద్, బొట్ట రాము, చిప్పల నాగదీప, జీవీఎంసీ సీవో కనకరత్నం పాల్గొన్నారు.

దేవీపురంలో ప్రత్యేక పూజలు



సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెదనాయుడుపాలెం గ్రామంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని కామాఖ్య పీఠంలో దశ మహావిద్యలు,కామాఖ్య దేవికి సామూహిక కళావాహన పూజలు శుక్రవారం నిర్వహించారు. విశాఖపట్నంలోని అక్కయ్యపాలేనికి చెందిన స్వపంతీ మాతృ మండలికి చెందిన సుమారు 50 మంది సుహసినీలు ఈ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 9 ఏళ్లుగా ఇదే సీజన్‌లో దేవీపురం వచ్చి మణిద్వీప వర్ణన పారాయణ 9 సార్లు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.మండలి అధ్యక్షురాలు సూర్యకుమారి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

సబ్బవరం: మండలంలోని పెదనాయుడు పాలెం గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం మండపం వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సబ్బవరపు బుజ్జి, నాగేంద్ర, గొర్లి శ్రీను, శరత్,బోకం రామకృష్ణ. లాలం సతీష్ గొర్లి భాను, శ్రీకాంత్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ



995వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధి ఇస్తున్న విశాఖ ఉక్కును పోరాటాలతోనే కాపాడుకోగలమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం, 995 వ రోజు సంస్థకు చెందిన ఆర్ఎండీ, కన్‌స్ట్రక్షన్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉక్కు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

9 నుంచి శాంతి సద్భావన పాదయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డి.వి.సూర్యారావు, పిల్లా వెంకట రమణమూర్తి

సీతంపేట: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), వంద విదేశీ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో వందే విశ్వమాతరం పేరిట 100 దేశాల్లో శాంతి సద్భావన యాత్రకు శ్రీకారం చుట్టారని సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం స్థానిక పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానా సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ సారథ్యంలో ఈ నెల 9న శాంతి సద్భావన యాత్ర ప్రారంభమవుతుందన్నారు. 2023–25 మధ్యకాలంలో రెండేళ్ల పాటు 100 దేశాల్లో 130కి పైగా సభలు జరుగుతాయని వెల్లడించారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం, మానవీయ విలువలు పెంపొందింపజేయడం, ప్రకృతి రక్షణ, పర్యావరణ పరిరక్షణ, విశ్వ శాంతి, సౌభ్రాతృత్వం తదితర లక్ష్యాలతో ఈ యాత్ర సాగుతుందన్నారు. పిల్లా వెంకటరమణమూర్తి, శేఖరమంత్రి ప్రభాకర్, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

క్రీడాకారులకు గెలుపే లక్ష్యం కావాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ద్రోణంరాజు కల్యాణ మండపంలో శుక్రవారం తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని 67వ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల జట్ల ఎంపికలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. విశాఖ జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలరాజు పర్యవేక్షణలో జరిగిన ఎంపికల్లో చంద్రంపాలెం హైస్కూల్ పీడీ పెంటకోట రాము, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రావణ్‌కుమార్, బంగారు ప్రకాశ్, రిఫరీలు ఆనంద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అండర్–14 ఎంపికలు

శనివారం అండర్–14 విభాగంలో బాలబాలికల జట్ల ఎంపికలు జరగనున్నాయని, అంతా సకాలంలో హాజరు కావాలని కన్వీనర్ ఎ.అప్పలరాజు కోరారు.

అంతర్ కళాశాలల కబడ్డీ విజేత రఘు కళాశాల

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జేఎన్‌టీయూ గురజాడ, విజయనగరం పరిధిలోని కళాశాలల కబడ్డీ పోటీల్లో రఘు ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో రఘు ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలల జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో దువ్వాడ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విజేత జట్లు అంతర్ రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నాయని తెలిపారు.